భక్తిప్రపత్తులతో నవరాత్రి ఉత్సవాలు



కీర్తనలు ఆలపిస్తున్న మహిళలు



అన్నపూర్ణ దేవి అలంకరణలో అమ్మవారు

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: తాండూరు పట్టణంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆయా మండపాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. నగరేశ్వర దేవాలయంలోని అమ్మవారిని ఆదివారం అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. వివిధ రకాల పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. ఇందిరానగర్‌లోని అమ్మవారి ఆలయంలో మహిళలు కీర్తనలు, భజనలు చేశారు.

కూష్మాండ దేవిగా అమ్మవారు



వికారాబాద్ వైభవలక్ష్మి ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన ఆదివారం అమ్మవారు కూష్మాండ దేవి (అన్నపూర్ణ)గా దర్శనమిచ్చింది. నీలం రంగు వస్త్రాలతో అలకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

–న్యూస్‌టుడే, వికారాబాద్ మున్సిపాలిటీ.

వార్డుకో ఉద్యానం



ఎల్ఐజీ కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన పార్కు

పురపాలక అధికారుల చర్యలు

న్యూస్‌టుడే, వికారాబాద్ మున్సిపాలిటీ: ఇంటి సమీపంలో ఆహ్లాదకరమైన వాతావరణంతో ఒక్క పార్కు అయినా ఉంటే ఎంతో మేలు అని అనుకోవడం సర్వసాధారణం. తీరిక వేళల్లో అక్కడికి వెళ్లి కాలక్షేపం చేయాలని, తమ పిల్లల్ని ఆడించాలని తల్లిదండ్రులు, మనుమలు, మనువరాళ్లను తీసుకెళ్లాలని తాతాలు భావిస్తుంటారు. ప్రజల కోరిక మేరకు వికారాబాద్ పట్టణంలో పార్కుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి నిర్మాణాలు చేపడుతున్నారు. వార్డుకో ఉద్యానం చొప్పున ఏర్పాటు చేయాలన్నదే పాలకవర్గం లక్ష్యం. ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు.

వికారాబాద్ పట్టణ ప్రస్తుత జనాభా అధికారికంగా 65 వేలు. 34 వార్డులున్నాయి. ఒకప్పుడు ఒక్క గాంధీ పార్కు మాత్రమే ఉండేది. దీనిని 60 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రతి వార్డుకు ఒక ఉద్యానాన్ని అభివృద్ధి చేస్తున్నారు. పట్టణంలో 100 వరకు ఖాళీ స్థలాలున్నాయి. అవసరం మేరకు నిధులు మంజూరు చేస్తూ పనులు చేపడుతున్నారు. దీంతో వార్డుల ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కోసం, పిల్లల్ని ఆడిపించటం కోసం పార్కులకు తీసుకొస్తున్నారు.

ప్రజలకు అందుబాటులోకి..

ఇటీవల కాలంలో సాకేత్‌నగర్, చౌదరి, బీటీఎస్, శివరాంనగర్ కాలనీల్లో పార్కులను వినియోగంలోకి తెచ్చారు. సాకేత్‌నగర్‌లో పిల్లలు ఆడుకోవటానికి క్రీడా పరికరాలు, పెద్దలు వ్యాయామం చేయడానికి వ్యాయామ పరికరాలను అమర్చారు. చౌదరి, బీటీఎస్, శివరాంనగర్ కాలనీల్లో క్రీడా పరికరాలు, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. ఎల్ఐజీ కాలనీలో ప్రహరీ నిర్మించారు. క్రీడా పరికరాలు వినియోగంలోకి తెచ్చారు. మొక్కలు నాటి అభివృద్ధి చేస్తున్నారు. మారుతీనగర్, గిరిగిట్‌పల్లి, రామయ్యగూడ, గరీబ్‌నగర్, ఎల్ఐజీ కాలనీల్లో ఖాళీ స్థలాల్లో ప్రహరీలను నిర్మించారు. బీటీఎస్, చౌదరికాలనీల్లో రూ.14 లక్షల వ్యయం చేశారు. పట్టణంలోని ఖాళీ స్థలాలను ఉద్యానాల్లా అభివృద్ధి చేస్తున్నామని పుర అధ్యక్షురాలు మంజుల తెలిపారు.

పంటల బీమా.. ఏదీ ధీమా!

● పరిగి మండలం నజీరాబాద్ తండాకు చెందిన దానిబాయి అనే రైతు నాలుగెకరాల పొలంలో కంది సాగు చేశారు. ఇందుకోసం రూ.40 వేలు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. కలుపు తీత అనంతరం పైరు కళకళలాడే దశలో కురిసిన భారీ వర్షాలు పంటను దెబ్బతీశాయి.

● నవాబుపేటకు చెందిన శేఖర్‌రెడ్డి ఐదెకరాల్లో మూడెకరాలు ఇతర, రెండెకరాల్లో కూరగాయ పంటలు సాగు చేశారు. వర్షాలకు టమాటా, క్యాలీఫ్లవర్, క్యాబేజీ కుళ్లిపోయి రంగుమారి నష్టం జరిగింది. పెట్టుబడి సైతం రావడం లేదు.



ధారూర్‌లో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ

భారీ వర్షాలతో.. గత నెలలో కురిసిన భారీ వర్షాలు అన్నదాతల ఆశలను తుంచేసింది. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పైర్లు ఆశాజనకంగా ఉన్న సమయంలోనే వరుణుని దెబ్బకు పరిస్థితులు తారుమారయ్యాయి. ఎక్కువగా పత్తి, మొక్కజొన్న, జొన్న, కంది పంటలకు నష్టం వాటిల్లింది. ఒక్కో పత్తి మొక్కకు కనీసం 40 నుంచి 50 కాయలు ఉంటేనే మంచి దిగుబడులు వస్తాయి. కానీ వీటిలో సగం కూడా లేవని రైతులు వాపోతున్నారు. మొక్కజొన్నకు ఎకరాకు రూ.10వేల వరకు, పత్తికి రూ.26 వేలకు పైగా పెట్టుబడులు పెట్టాల్సి వచ్చిందని చెబుతున్నారు.

న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్

ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే ఆదుకునే బీమా పథకం గత మూడేళ్లుగా అమలు కావడం లేదు. కోటి ఆశలతో రైతులు ఖరీఫ్ సీజన్‌కు శ్రీకారం చుట్టినా చివరకు కష్టాలు నష్టాలే వెంటాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ధీమా లేకపోవడంతో ఆఖరుకు పెట్టిన పెట్టుబడులు కూడా అందకుండా పోతున్నాయని వాపోతున్నారు.

జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజవకర్గాల్లో వానాకాలం సాధారణ సాగు 5,78,874 ఎకరాలు. వివిధ రకాల పంటలు 5,35,650 ఎకరాల్లో సాగులోకి వచ్చాయి. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న ఉన్నాయి. సీజన్ ప్రారంభ సమయంలో వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు. దీంతో 43 వేల ఎకరాలు సాగుకు నోచుకోలేదు. ప్రధానంగా వరి పంటకు అవరోధం కలిగింది.

మూడేళ్లుగా ఊసే లేదు

గతంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసేవి. మూడేళ్లుగా దాని ఊసే లేకపోవడంతో పరిహారం అందకుండా పోతోంది. జిల్లాలోని పరిగి, మోమిన్‌పేట, ధారూర్, పెద్దేముల్, తాండూరు, కుల్కచర్ల, నవాబుపేట, యాలాల, మర్పల్లి, వికారాబాద్ మండలాల్లో సుమారు 15 వేల ఎకరాల్లో ఆయా పంటలకు నష్టం కలిగింది. ఇప్పటికైనా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని డివిజన్ రైతులు కోరుతున్నారు.

అంచనాలు పంపాం



భారీ వర్షాల కారణంగా వివిధ మండలాల్లో 1432 ఎకరాల్లో నష్టం జరిగింది. ప్రభుత్వానికి అంచనాలు పంపాం. వాతావరణం అనుకూలించడంతో యాసంగిలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నాం. –మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న భాజపా నాయకులు

వికారాబాద్, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని భాజపా జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు వికారాబాద్ పురపాలక సంఘం శివారులోని కొత్తగడి బంగారు మైసమ్మ ఆలయ పరిధిలో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులు పడేసిన వ్యర్థాలను, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. భక్తులు చెత్తను కుండీల్లోనే వేసి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నియోజకవర్గ సమన్వయకర్త వడ్ల నందు, కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు నరోత్తంరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

లింగబలిజలను ఓబీసీలో చేర్చాలి



మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఈశ్వరప్ప, పక్కన రాష్ట్ర అధ్యక్షుడు సంగమేశ్వర్

తాండూరుగ్రామీణ: వీరశైవ లింగాయత్ లింగబలిజలను ఓబీసీ జాబితాలోకి చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెన్నె ఈశ్వరప్ప, రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్ డిమాండ్ చేశారు. గౌతాపూర్ శివారులోని వేడుక మందిరంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, 80 శాతం పేదలుగా ఉన్న బలిజలకు రాయితీలు వర్తింపజేసి ప్రోత్సహించాలన్నారు. తమ పోరాటంతోనే ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వరుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి, జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బాలి రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడిగా ఉదయ్‌శంకర్, ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్‌తో పాటు పలువురిని ఎన్నుకున్నారు. ప్రమాణస్వీకారం చేయించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేష్‌పాటిల్, సూర్యశ్రావణి పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. ప్రయాణానికి తంటా




ధారూర్ పెట్రోలు పంపు సమీపంలో గుంతలు



రాంపూర్ మార్గంలో..

తాండూరు నుంచి వికారాబాద్ వరకు వెళ్లే రోడ్డు ధారూర్ మండలం కెరెల్లి వరకు అధ్వానంగా మారింది. 30 కిలోమీటర్ల పొడవునా 1000కి పైనే గుంతలున్నాయి. తారు, కంకర తొలగిపోయి రాకపోకల సమయంలో వాహనాలు అదుపు తప్పేంత ప్రమాదకరంగా మారింది. గుంతలు పడిన ప్రదేశం వద్దకు రాగానే వాహనదారులు నానా హైరానా పడుతున్నారు. తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రోడ్డు మార్గంలోని రాజీవ్ గృహకల్ప, ఖాంజాపూరు గేట్, కందనెల్లి, మంబాపూరు, దుగ్గాపూరు, మన్‌సాన్‌పల్లి, మారెపల్లి తండా గేట్, మదనంతాపూరు గేట్, గట్టేపల్లి గేట్, రాంపూరు గేట్, ధారూరు, బాచారం, కెరెల్లి గ్రామం వరకు ప్రయాణం నరకమే. ఒళ్లు హూనం కావల్సిందే. 2017లో తాండూరు నుంచి వికారాబాద్ వరకు రూ.57 కోట్ల వ్యయంతో రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు పూర్తి కాలేవు. వేసిన తారు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తొలగిపోయింది. నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. అధ్వానంగా మారిన రోడ్డును బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, తాండూరు.

టవరెక్కితే అనంత అందాలు



వికారాబాద్ పట్టణానికి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనంతగిరి కొండలను నలువైపులా చూడాలంటే తప్పకుండా వాచ్‌టవర్ ఎక్కాల్సిందే. ఇక్కడి నుంచి చేస్తే వికారాబాద్ పట్టణం, కోట్‌పల్లి ప్రాజెక్టు, రైల్వే లైన్ కొండల చుట్టూ ఉన్న గ్రామాలు ఎంతో అందంగా కనిపిస్తాయి. ఒక్కోసారి రైలు వెళ్తున్న దృశ్యం ఆహ్లాదకరంగా ఉంటుంది. ప్రతి శని, ఆదివారాల్లో హైదరాబాద్ నగరం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఈ వాచ్‌టవర్‌ను ఎక్కి నలువైపులా చూసి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తారు.

–న్యూస్‌టుడే, వికారాబాద్ మున్సిపాలిటీ, వికారాబాద్ గ్రామీణ.

గోడు వినండి.. న్యాయం చేయండి

ప్రజావాణిలో పేరుకుపోతున్న అర్జీలు

వికారాబాద్ కలెక్టరేట్, పరిగి న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్, మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజావాణికి అర్జీలు వెల్లువలా వస్తున్నాయి. మండల కేంద్రాల్లో పట్టించుకోవడం లేదు. దీంతో ఎన్నో ఆశలతో కలెక్టరేట్ కార్యాలయానికి తరలివస్తున్నా తమకు న్యాయం జరగడం లేదని అర్జీదారులు వాపోతున్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి సుమారు వంద వరకు ఫిర్యాదులు వస్తున్నాయి. గత ఐదునెలల కాలంలో సుమారు 1000 పైనే అందాయి. ఇందులో 20 శాతం కూడా పరిష్కరించడం లేదని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. ఒకసారి పరిష్కారం కాకుంటే మళ్లీ మళ్లీ రావలసి వస్తోందని, దీంతో పనులన్నీ పక్కన పెట్టాల్సి వస్తోందని పలువురు ఆవేదన చెందుతున్నారు.

2015 నుంచి తిరుగుతూనే ఉన్నా..



నాకు 90 శాతం వైకల్యం ఉంది. 2015లో సదరం ధ్రువపత్రం కోసం దరఖాస్తు పెట్టుకున్నా. ఆ తర్వాత ధ్రువపత్రం జారీ చేసినట్లు మీ-సేవలో చూపెడుతున్నా ఇప్పటి వరకు రాలేదు. తొమ్మిది సంవత్సరాల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా సరైన సమాధానం చెప్పడం లేదు. దీంతో ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం అందడం లేదు.– ప్రభాకర్, బార్వాద్.

మరణ ధ్రువపత్రం ఇవ్వండి



నా అన్న కొడుకు రిక్కల అభిషేక్‌రెడ్డి 2023 డిసెంబరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో మృతిచెందాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు వారు పత్రం ఇచ్చారు. ఇది ఎందుకూ పనికి రావడం లేదు. గ్రామ కార్యదర్శిని మరణ ధ్రువపత్రం ఇవ్వాలని కోరగా స్పందన లేదు. మండల అధికారులను కలిసినా ప్రయోజనం లేకపోయింది. హైదరాబాద్ చందానగర్ పురపాలక సంఘ కార్యాలయానికి వెళ్లినా వారు నిరాకరించారు. అభిషేక్‌రెడ్డి పేరుపై బ్యాంకులో డబ్బులున్నాయి. జీవిత బీమా పాలసీ ఉంది. వీటిని తీసుకోవాలంటే ధ్రువ పత్రం అవసరం. – ప్రభాకర్‌రెడ్డి, మల్‌రెడ్డిగూడ, మోమిన్‌పేట.

రైతు బీమా డబ్బుల మంజూరులో జాప్యం



మా నాన్న మాణిక్‌రెడ్డి మృతి చెందాడు. ఆయన రైతు బీమా పాలసీ చేశారు. డబ్బులు రావాల్సి ఉంది. పాలసీ బాండ్ కూడా ఉంది. అధికారుల వద్దకు వెళ్లి తెలుసుకోగా బాండ్‌పై ఆధార్ నంబర్ తప్పుగా నమోదు చేశారని తేలింది. సదరు అధికారులపై చర్యలు తీసుకొని ఆధార్ నంబరు సరిచేసి న్యాయం చేయాలి.

–శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మాపూర్, పూడూరు.

శేష వాహనంపై పద్మనాభుడు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని అలంపల్లి ఆలయంలో ఆదివారం రాత్రి పద్మనాభ స్వామిని శేష వాహనంపై ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వికారాబాద్



సమాజసేవకు యువత ముందుండాలి



వాహన ప్రారంభోత్సవంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: సామాజిక సేవకు యువత ముందుకు రావడం ఎంతో అభినంద నీయమని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మోమిన్‌పేట గ్రామానికి చెందిన విష్ణుకాంత్‌రెడ్డి వికలాంగులు, వృద్ధులు, గర్భిణులకు ఉపయోగపడే విధంగా ఎలక్ట్రిక్ వాహన సౌకర్యం కల్పించాడు. ఆ వాహన ప్రారంభోత్సవం సందర్భంగా పట్టణంలోని బసవేశ్వరచౌక్ దగ్గర వాహనానికి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై అరవింద్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. అత్యవసర సమయాల్లో వాహనం కావాల్సిన వారు 93460 08003 చరవాణిని సంప్రదించాలని విష్ణుకాంత్ రెడ్డి గ్రామస్థులకు సూచించారు.

వీధి శునకాల పట్టివేత షురూ..

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలో వీధి శునకాల సమస్య నివారణకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు ఆదివారం 30 దాకా కుక్కలను పట్టుకున్నారు. పట్టణ వ్యాప్తంగా అధికారికంగా 1200 దాకా ఉంటాయని అధికారులు అంచనా వేశారు. పట్టుకున్న వాటిని పట్టణ శివారులోని డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్రానికి తరలించారు.

అనుకోని ప్రమాదం.. అండగా ఆర్థిక సాయం

● బొంరాస్‌పేట మండలం ఎన్కేపల్లికి చెందిన ఆంజనేయులు ఈ నెల ఒకటో తేదీన పొలంలో విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆ కుటుంబానికి వ్యవసాయమే జీవనాధారం. పెద్దదిక్కును కోల్పోవడంతో భార్యాపిల్లలు ఆధారం లేకుండా పోయింది.

న్యూస్‌టుడే, బషీరాబాద్, పాత తాండూరు



విద్యుదాఘాతంతో మూడేళ్లలో 53 మంది మృత్యువాత

విద్యుదాఘాతంతో మృత్యువాత పడిన రైతులు, ఇతరులకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తోంది. అనుకోని.. ఊహించని సంఘటనతో ప్రాణాలు విడిచినప్పుడు ఆ కుటుంబం ఛిన్నాభిన్నం కాకుండా సాయం చేదోడుగా ఉంటుంది. ఈ క్రమంలోనే జిల్లాలోనే పలువురికి సాయం అందింది.

జిల్లా ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. సాగుకు 62 వేలకు పైగా ఏజీఎల్ (వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు) ఉన్నాయి. వివిధ కారణాలతో ఫ్యూజులు పోవడం, తీగలు తెగిపోవడం, అడవి పందులు, పశువుల నుంచి పంట రక్షణ నిమిత్తం కంచెకు కరెంటు సరఫరా ఇవ్వడం వంటి కారణాలతో సొంతంగా పనులు చేసుకునే క్రమంలో ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయి.

మూడేళ్లలో..: 2021 నుంచి 2024 అక్టోబరు 4వ తేదీ వరకు 53 మంది విద్యుదాఘాతంతో మరణించారు. 18 మంది బాధిత కుటుంబాలకు పరిహారం మంజూరైంది. 151 పశువులు మృత్యువాత పడితే 102 మంది బాధితులకు సాయం అందింది. మొత్తంగా బాధిత కుటుంబాలకు రూ.25 లక్షలు, పశు బాధిత కుటుంబాలకు రూ.15,15,000 మొత్తం కలిపి రూ.40.15 లక్షలను ప్రభుత్వం అందజేసింది.

పరిహారం ఇలా...: వ్యక్తి విద్యుదాఘాతంతో మరణిస్తే రూ.5 లక్షలు, గాయపడితే తీవ్రతను పరిగణలోకి తీసుకొని రూ.4 లక్షల వరకు వారి కుటుంబసభ్యులకు అందిస్తోంది. పశువులు మృతిచెందితే రూ.40 వేలు, మేకలు, గొర్రెలు మరణిస్తే రూ.7 వేలు నష్టపరిహారంగా అందిస్తోంది. సంఘటన జరిగిన తర్వాత ఎఫ్ఐఆర్ కాపీ, పంచనామా, పోస్టుమార్టం రిపోర్టులు, లీగల్ హెయిర్ ధ్రువపత్రం, ఆధార్, చిరునామా వంటి పూర్తి వివరాలతో ఆయా మండలాల విద్యుత్తు ఏఈలకు దరఖాస్తు చేసుకోవాలి. డిస్కం వెబ్‌సైట్‌లోనూ చేసుకోవచ్చు.

నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం..

ప్రమాదాలు, సమస్యలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం. పొలాల వద్ద సమస్య ఉత్పన్నమైతే వెంటనే మా సిబ్బందికి సమాచారం అందించాలి. సిబ్బంది వెంటనే వెళ్లి బాగు చేస్తున్నారు. స్వయంగా మరమ్మతులు చేసుకోవద్దని వివరిస్తున్నాం. బాధిత కుటుంబాలకు పరిహారం అందజేస్తున్నాం. – సంజీవరెడ్డి, ఎస్ఈ, వికారాబాద్.

కల్తీ యాసిడ్ విక్రయదారుల అరెస్టు



కల్తీ యాసిడ్ సీసాల కాటన్లను చూపిస్తున్న ఎస్సై అరుణ్‌కుమార్

నవాబుపేట, న్యూస్‌టుడే: కల్తీ యాసిడ్ తయారుచేసి విక్రయిస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు.. నవాబుపేట మండల పరిధి మూలమాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఓ ఇంట్లో యాసిడ్‌లో డిస్టిలరీ నీరు కలిపి వాహనాల బ్యాటరీలో ఉపయోగించే యాసిడ్‌ను తయారుచేసి కొంత కాలంగా విక్రయిస్తున్నారు. పక్కా సమాచారం నిఘా ఉంచిన వికారాబాద్ టాస్క్‌ఫోర్స్, నవాబుపేట పోలీసులు ఆదివారం యాసిడ్ తయారు చేస్తున్న ఇంటిపై దాడి చేశారు. 134 డిస్టిలరీ సీసాల పెట్టెలు, 50 యాసిడ్ సీసాల బాక్సులు, సామగ్రి, ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తీసుకొచ్చారు. కల్తీకి పాల్పడుతున్న, యాసిడ్‌ను వాహనంలో రవాణా చేస్తున్న బోజిరెడ్డి, రవికిరణ్‌లపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

గర్భిణి మృతి.. కుటుంబ సభ్యుల ఆందోళన

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: తాండూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నిండు గర్భిణి మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకులు, బంధువులు ఆరోపించారు. మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన అక్షితకు(21) కోస్గీ మండలం కొత్తపల్లికి చెందిన రమేష్‌తో వివాహం జరిగింది. ప్రస్తుతం గర్భిణి. నెలలు నిండుతుండటంతో ఓ ఆస్పత్రిలో స్కానింగ్ చేయించగా ఆమె కడుపులో ఉన్న శిశువుకు వెన్నెముక సమస్య ఉందని వైద్యులు తెలిపారు. శిశువును తొలగిస్తే సమస్య నుంచి బయట పడవచ్చని, సూచించగా శనివారం సాయంత్రం ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ఆమెకు పరీక్షలు చేశారు. చికిత్స అందిస్తున్న క్రమంలో ఆదివారం రాత్రి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు వైద్యుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే డాక్టర్లు ఆమెను పరీక్షించి అప్పటికే చనిపోయిందని చెప్పడంతో బోరున విలపించారు. గర్భిణి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. తమకు న్యాయం జరిగేవరకు మృతదేహాన్ని ఆస్పత్రి నుంచి వెళ్లబోమని భీష్మించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో అక్షితకు గుండె నొప్పి వచ్చి ఉంటుందని, తమ నిర్లక్ష్యమేమి లేదని వైద్యులు తెలిపారు.

ప్రకృతి ఆరాధనే.. బతుకమ్మ..

బతుకమ్మ పూల పండగ.. ప్రకృతిని ఆరాధించే వేడుక.. మనుషుల మధ్య బంధాన్ని పెంచడంతో పాటు అందరి బతుకు కోరుతుంది. ఇదే బతుకమ్మ పరమార్థం. ఇందులో ఉండే విశేషాలు, పాటల్లో ఉండే అంశాలు ప్రజలకు తెలియజెప్పే లక్ష్యంతో పలువురు దీనిపై అధ్యయనం చేశారు. ఆయా విశేషాలు ఇలా..

- న్యూస్‌టుడే, సిద్దిపేట, చేర్యాల

28 ఏళ్లుగా పరిశోధన..



పాడి పంటలు, పర్యావరణంతో ముడిపడిన పండగ బతుకమ్మ అని అంటారు సిద్దిపేట స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు సహ ఆచార్యులు డా. మట్ట సంపత్‌కుమార్‌రెడ్డి. స్వస్థలం కరీంనగర్. 2022లో ఇల్లంతకుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా ప్రస్థానం మొదలైంది. తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతి అంటే అమితాసక్తి. 2014లో తెలంగాణ కథా సాహిత్యం-స్థానికతపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1996లో బతుకమ్మ, జానపద పాటలపై పరిశోధన ఆరంభించారు. 28 ఏళ్లలో 60కి పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. 200కి పైగా బతుకమ్మ పాటల్లోని అంశాలను అధ్యయనం చేసి ఎన్నో విషయాలు వెల్లడించారు. వ్యవసాయం, ఆడబిడ్డ, పర్యావరణం, చరిత్ర, స్త్రీ పురుష సంబంధాలు, మానవీయ, ప్రకృతి, జీవకోటి, ఆహారం అటవీ, జల వనరుల అంశాల్లో ముడిపడి ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇటీవల 'గంగ దర్వాజ' పేరిట పుస్తకం వెలువరించారు. బతుకమ్మ పాటల పుస్తకం ఆవిష్కరణకు సిద్ధమయ్యారు.


పండగ అంతరార్థం ఇది..: సృష్టిలో ఏ ప్రాణికైనా సంతానోత్పత్తి ప్రథమ ఆశయం. పూలు పరపరాగ సంపర్కం జరిపి ప్రతి సృష్టికి సిద్ధమైన తరుణంలో తెలంగాణ సమాజం పూలకు జరిపే వేడుకగా బతుకమ్మ. సమస్త జీవకోటికి అనుసంధానించే వేడుకగా అభివర్ణించవచ్చు. బొడ్డెమ్మ.. ఎదుగుతున్న బాలికకు ప్రతి సంకేతం. బతుకమ్మ.. ఎదిగి పెళ్లి పేరంటం చేసుకున్న స్థితికి సంకేతం. **డా. మట్ట సంపత్‌కుమార్‌రెడ్డి**

గుర్తించారిలా..

● ఈ పండగ.. స్త్రీ తత్వం గొప్పతనాన్ని చాటుతుంది. మనిషికీ, ప్రకృతికీ ఉండే అవినాభావ సంబంధాన్ని తెలుపుతుంది. ఆడబిడ్డకు, పుట్టినింటికి ఉండే రక్త సంబంధాన్ని వివరిస్తుంది. తెలంగాణ సమాజం పండగ ఏర్పాటు పర్యావరణ విలువలను కాపాడేందుకు చేస్తున్న గొప్ప ప్రయత్నం.

● నిరాడంబరత్వం, ప్రకృతిని కొలిచే విధానం ప్రస్ఫుటమవుతోంది. ప్రతి ఊళ్లోనూ పండగను ఉమ్మడిగా చేసుకోవడం నాటి నుంచి అలవర్చుకోవడం విశేషం.

బహుళ ప్రాచుర్యంతోనే..



శాస్త్రీయంగానే కాకుండా మానవ సంబంధాలతో పెనవేసుకున్న బతుకమ్మ విశేషాలను అందరికీ తెలిసేలా ప్రాచుర్యం కల్పించాలని అంటున్నారు చేర్యాల మండలం ఆకునూరుకు చెందిన విష్ణుమూర్తి. కాకతీయ విశ్వవిద్యాలయంలో 'బతుకమ్మ పండగ పాటలు (సంస్కృతి సంప్రదాయాలు)'పై పరిశోధన చేసి పుస్తకం వెలువరించారు. ఉపాధ్యాయుడిగా పని చేసి రెండేళ్ల కిందట పదవీ విరమణ పొందారు.

పల్లె స్ఫూర్తితో ఆటా పాటలపై..

విష్ణుమూర్తి పల్లె నేపథ్యం కావడంతో పండగలపై ఆసక్తి పెరిగింది. ప్రధానంగా ఊరంతా కలిసి చేసుకునే బతుకమ్మ గురించి తెలుసుకోవాలన్న ఉత్సుకత చూపారు. అదే దానిపై అధ్యయనం చేసేలా చేసింది. ఏయే ప్రాంతాల్లో ఈ పండగను ఎలా చేసుకుంటారో తెలుసుకున్నారు. ఆటాపాటలపై పరిశోధన చేశారు. బతుకమ్మ పండగ పూర్వ వైభవానికి ప్రత్యేక కార్యాచరణ అవసరమని గుర్తించారు. ప్రత్యేక నిధులు మంజూరు చేసి, ఊరూరా వేదికలు ఏర్పాటు చేయడంతో పాటు ఇంకేం చేయాలో తన పుస్తకంలో పొందుపరిచారు.

మరెన్నో విషయాలు

జానపద సాహిత్యం మొదలుకొని బతుకమ్మ పండగ స్వరూప స్వభావాలు, పాటల వర్గీకరణతో పాటు సంస్కృతి, సంప్రదాయం తదితర అంశాలను పుస్తకంలో వివరించారు. వ్యవసాయానికి స్త్రీ, పురుష సంబంధాలు- సామాజిక జీవనం, జానపదుల నమ్మకాలు, దుస్తులు, ఆభరణాలు, ఆహారం, ఆటలు, వినోదం వంటివెన్నో ఉన్నాయి. పండగ పాటలు, సంగీత నృత్య విశేషాలు, భాషావిశేషాలనూ క్షుణ్ణంగా విపులీకరించారు. మహిళలు పాడే పాటల్లోని ఛందస్సు, అలంకారాలు, సామెతలు, జాతీయాలు, నుడికారాలు, వర్ణాలు, వర్ణవ్యత్యయం, ప్రత్యయాలు, నవ్యకల్పనలు, ఇష్ట దేవతాస్తుతి, మాండలికాలు ఇలాంటి విషయాలను పుస్తకంలో విశ్లేషించారు.



కాలినడకన కదిలి.. అమ్మను దర్శించి



దేశవ్యాప్తంగా దసరా సంబరాలు మొదలయ్యాయి. మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీ మాత ఆలయంలో జరిగే ఉత్సవాలు తనివితీరా చూసి తీరాల్సిందే. ఉమ్మడి మెదక్ జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు, నర్సాపూర్, వికారాబాద్ జిల్లా తాండూరు తదితర ప్రాంతాలకు చెందిన భక్తులెంతో మంది అమ్మను ఇలవేల్పుగా కొలుస్తుంటారు. దసరా సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి కాలినడకన ఆలయానికి వెళ్లి అమ్మను దర్శించుకొని మొక్కు చెల్లించుకుంటుంటారు. ఈ సారి జాతరకు సైతం భారీగా ప్రజలు బృందాలుగా నడుచుకుంటూ ఆలయం బాట పట్టారు. వారంతా 65వ నంబరు జాతీయ రహదారిపై జహీరాబాద్ మీదుగా తుల్జాపూర్‌కు వెళ్తుంటారు. మూడు రోజులుగా ఆ రోడ్డంతా కిటకిటలాడుతోంది. దసరా మరుసటి రోజు వరకు ఈ సందడి కనిపిస్తుంది.

అత్యధికులు..

దసరా సందర్భంగా దుర్గమ్మ మండపాలు, ఇళ్లల్లో ప్రతిష్ఠించుకొని పూజించడం ఆనవాయితీ. జహీరాబాద్‌కు 180 కి.మీ. దూరంలో ఉన్న తుల్జాపూర్ భవానీమాతను దర్శించుకోవడం పవిత్రంగా భావిస్తారు. అత్యధికులు కాలినడకకే ప్రాధాన్యం ఇస్తారు. కొందరు మిత్రులతో కలిసి బృందంగా వెళ్తుంటారు.

అన్నదాన శిబిరాలు..

జహీరాబాద్‌కు చెందిన పలువురు భక్తుల కోసం అన్నదాన శిబిరాలు ఏర్పాటుచేస్తూ తమవంతు సహకారం అందిస్తున్నారు. జహీరాబాద్- తుల్జాపూర్ మధ్యలో 100కు పైగా శిబిరాలు వెలిశాయి. వీటిలో జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాలకు చెందిన వారికే సగం వరకు ఉన్నాయి.

- న్యూస్‌టుడే, జహీరాబాద్

శరన్నవరాత్రి ఉత్సవాల్లో సామాజిక చైతన్యం



దుబ్బాక పట్టణంలోని 20వ వార్డులో యువకిరణం స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గామాత అమ్మవారి మండపాన్ని ఏర్పాటు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సభ్యులు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలే కాకుండా సామాజిక చైతన్యంపై దృష్టి సారించారు. నేడు సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరిస్తూ, 'మత్తు వదలరా' పేరిట భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వీరు గతంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో సైబర్ నేరాలు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగించడం గమనార్హం.

- న్యూస్‌టుడే, దుబ్బాక

నాట్యమయూరి.. నివేదిత



ఓ వైపు నృత్యం.. మరోవైపు నటనలో రాణించడంతో పాటు చదువులో ముందంజలో ఉంటోంది ఈ బాలిక. అందరి మన్ననలు పొందుతున్న ఆ బాలికే సంగారెడ్డి జిల్లా కంగ్టికి చెందిన 12 ఏళ్ల నివేదిత. తల్లిదండ్రులు వడ్లలత, దత్తాత్రి. తండ్రి రైల్వే ఉద్యోగి కాగా, తల్లి గృహిణి. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. తల్లిదండ్రులకు కూచిపూడిపై ఉన్న ఆసక్తితో కుమార్తెను ప్రోత్సహించారు. నాలుగేళ్ల వయసులోనే నివేదిత గురువు శ్రీనివాస్‌వరప్రసాద్ వద్ద ఓనమాలు నేర్చుకున్నారు. ఐదేళ్ల వయసు నుంచి ప్రదర్శన ఇవ్వడం మొదలుపెట్టారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో 250కి పైగా ప్రదర్శనలు ఇవ్వడం విశేషం.

సంకల్పంతో సాధన

నివేదిత గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయంలో 7వ తరగతి చదువుతోంది. నిత్యం ఉదయం 5 గంటలకు సాధన చేస్తారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణకు వెళ్తున్నారు. నృత్యం, మోనో యాక్షన్‌లో ఏకకాలంలో రాణిస్తున్నారు. నాలుగేళ్ల కిందట తానా ఆధ్వర్యంలో నిర్వహించిన మోనో యాక్షన్ ఆన్‌లైన్ పోటీలో రాణిరుద్రమదేవిగా అభినయించి తొలి స్థానంలో నిలిచారు. ఈ పోటీలో 40 దేశాలకు చెందిన 680 మంది కళాకారులు పాల్గొన్నారు. నృత్యకళా బాలప్రతిభా మహోత్సవ్, భారత రంగస్థల, అఖిలనటరాజన్, అంతర సాంస్కృతిక సంస్థాన్, భారతీయ నృత్య సమ్మేళన్, సంస్కారభారతి, రాష్ట్రీయ కళామహోత్సవ్ తదితర అకాడమీలు నిర్వహించిన పోటీల్లో ప్రతిభచాటి బహుమతులు అందుకున్నారు. ఇటీవల మహానంది, బాలకళాశ్రీ నృత్య పురస్కారాలు అందుకున్నారు. 2024-25కు గాను బాల పురస్కారానికి నామినేషన్ వేశారు.

- న్యూస్‌టుడే, నారాయణఖేడ్, కంగ్టి

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరి దుర్మరణం

జిన్నారం, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం శివారులో ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.... విశాఖ జిల్లా అనకాపల్లికి చెందిన వీర్రాజు కుటుంబ సభ్యులతో 20 ఏళ్లుగా గడ్డపోతారంలో నివసిస్తూ.. స్థానిక పరిశ్రమలో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి గడ్డపోతారం శివారు నుంచి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ద్విచక్ర వాహనదారుడికీ తీవ్ర గాయాలవడంతో స్థానికులు సూరారంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీర్రాజుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఐడీఏ బొల్లారం పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..


వెంకటి

రామాయంపేట, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేటకు చెందిన ముత్యం వెంకటి(38) రామాయంపేట పట్టణంలోని ఓ దుకాణంలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలోనే రామాయంపేట నుంచి ద్విచక్ర వాహనంపై అక్కన్నపేటకు వస్తున్నాడు. గ్రామ శివారులోని పకీరు సాబ్ గుట్ట వద్దకు రాగానే ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి ఎల్లవ్వ ఆయనపైనే ఆధారపడి జీవిస్తోంది.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు


రవీందర్

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: గుండెపోటుతో తాండూరు పట్టణంలోని షావుకార్‌పేట్‌కు చెందిన కానిస్టేబుల్ కావలి రవీందర్(38) మృతి చెందాడు. పెద్దేముల్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఆయన ఎప్పటిలాగే శనివారం విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చారు. రాత్రికి భోజనం చేసి పడుకున్నారు. ఉదయం ఎంతకు నిద్ర లేవకపోవడంతో భార్య మహేశ్వరి స్థానికులను పిలవడంతో వారు వచ్చి అతడిని లేపే ప్రయత్నం చేశారు. లేవకపోవటంతో వెంటనే 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. దీంతో కుటుంబీకులు బోరున విలపించారు. రవీందర్‌కు ఎనిమిదేళ్ల కూతురు శ్రావ్య, నాలుగేళ్ల కొడుకు అభిరాం ఉన్నాడు. పట్టణంలోని గొల్లచెరువు శ్మశానవాటికలో ఆదివారం సాయంత్రం పోలీసులు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అదృశ్యమై.. విగతజీవిగా లభ్యమై..


నర్సయ్య

చేగుంట, న్యూస్‌టుడే: అదృశ్యమైన వృద్ధుడు మృతిచెందిన ఘటన చేగుంట మండలం మక్కరాజుపేటలో జరిగింది. స్థానిక ఎస్సై చైతన్య రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నర్సయ్య(69) గత నెల 14న సాయంత్రం పొలం సమీపంలో ఉన్న పశువుల కొట్టం వద్దకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం పొలం సమీపంలో ఉన్న కుంటలో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహం ఉందని రైతులు గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించారు. విషయాన్ని కుటుంబీకులకు తెలపడంతో అక్కడికి వెళ్లి చూశారు. అదే రోజు ఇంటికి వచ్చే క్రమంలో కుంటలో జారిపడి.. మృతిచెంది ఉంటాడని తెలిపారు. కుటుంబసభ్యులు అంతటా వెతికినా.. కుంట వైపు వెళ్లకపోవటంతో ఆచూకీ లభించలేదన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు				
	ఫాంరేటు	114-00	డ్రెస్డ్	197-00
	రిటైల్	136-00	స్కిన్‌లెస్	224-00

కుటుంబ కలహాలతో బలవన్మరణం

తూప్రాన్, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నెంటూర్‌కు చెందిన శ్రీశైలం(45) కొంతకాలంగా కుటుంబంతో కలిసి తూప్రాన్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కుటుంబంలో గొడవ జరగడంతో శనివారం అర్ధరాత్రి దాటాక ఓ గదిలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం తెలియజేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మరొకరు..


కుమార్

నిజాంపేట, రామాయంపేట: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన నిజాంపేట మండల పరిధి నార్లాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మిరుదొడ్డి కుమార్(41) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తన కుటుంబ బాగోగులు సరిగా చూసుకోలేకపోతున్నానని మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో నుంచి వెళ్లిన కుమార్ గ్రామ శివారులోని పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం స్థానికులు గమనించడంతో విషయం వెలుగు చూసింది. భార్య మంజుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

సింగపూర్‌లో తీరొక్క పూలు.. పాటల హోరు



చేగుంట, న్యూస్‌టుడే: సింగపూర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలు శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగాయి. అక్కడి తెలంగాణ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వేలాదిగా పాల్గొన్నట్లు చేగుంట మండలం రుక్మాపూర్‌కు చెందిన టీసీఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి బసికె ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన తల్లిదండ్రులు సైతం సింగపూర్‌కు వెళ్లారు. తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేసి మూడు గంటల పాటు పాటలు పాడుతూ ఆడారు. చిన్నపిల్లలు, యువతులు, మహిళలు ఆనందోత్సవాల మధ్య పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

పట్టుదలతో సాగితే విజయం ఖాయం


జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న మెదక్ మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, రమేశ్, ఆదర్శ్, పీడీలు


క్రీడా ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారిణులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పట్టుదలతో, శిక్షకుల సహకారంతో ముందుకు సాగితే విజయం ఖాయమని మెదక్ పురపాలిక అధ్యక్షుడు చంద్రపాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. పోటీల పరిశీలకులు ఆదర్శ్ మాట్లాడుతూ.. చదువుతో పాటు ఆటలపై దృష్టి సారించాలన్నారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేశ్, తదితరులు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 10 ఉమ్మడి జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రతిభ చూపిన వారు రాష్ట్రస్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇటీవల దక్షిణ కొరియాలోని సియోల్‌లో నిర్వహించిన స్లమ్ సాకర్ అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో దేశం తరఫున పాల్గొన్న మెదక్ క్రీడాకారిణి కావేరికి.. చంద్రపాల్ టోపీ, బ్యాగ్ అందించి అభినందించారు. సమన్వయకర్త నాగరాజు, పీడీలు మాధవరెడ్డి, రాజేందర్, మహిపాల్, ప్రతాప్ సింగ్, రవి, సత్యం, మాలతి, లతీఫ్ తదితరులున్నారు. ● మెదక్ జట్టు నిజామాబాద్, హైదరాబాద్ జట్లతో రెండు మ్యాచ్‌ల్లో పోటీ పడగా మెదక్ విజయం సాధించింది. దీంతో సెమీఫైనల్ బెర్తు ఖాయం చేసుకుంది. ● ఖమ్మం-నిజామాబాద్ జట్ల మధ్య పోటీలో నిజామాబాద్, కరీంనగర్-నల్గొండ జట్ల మధ్య జరిగిన పోటీలో నల్గొండ విజయాలు సాధించాయి. రంగారెడ్డి - నల్గొండ జట్ల మధ్య పోటీ టై అయింది.

ప్రార్థనాలయం.. భక్తి పారవశ్యం


ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం భక్తిపారవశ్యంతో కరుణామయుడి ప్రార్థనలు కొనసాగాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వాసులతో పాటు ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు, సందర్శకులు తరలివచ్చారు. ఏసయ్యను దర్శించుకొని ప్రార్థనలుచేపట్టారు. భక్తులు, పర్యాటకులతో మహాదేవాలయం సందడిగా మారింది. గురువులు శిలువను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రార్థనామందిరంలో ప్రతిష్ఠించి ఆరాధనలు చేపట్టారు. మెదక్ ప్రెసిబిటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య, గురువు రిచార్డ్ దైవసందేశం వినిపించారు. భక్త బృందాలు ఆలపించిన పాటలు అలరించాయి. గురువులు జైపాల్, శ్రీనివాస్, చర్చి కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానంలో పాల్గొన్న మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సిద్దిపేట సర్వజన ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో స్వచ్ఛందంగా 25 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి శ్రావణి, అసోసియేషన్ అధ్యక్షుడు గందె సంతోష్‌కుమార్ మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. మూడునెలకోసారి రక్తం ఇస్తే చెడు రక్తం పోయి మంచి రక్తం తయారవుతుందన్నారు. రక్తదానం చేస్తే అనారోగ్యానికి గురవుతామన్నది కేవలం అపోహ మాత్రమేనన్నారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసిన అసోసియేషన్ ప్రతినిధులను రక్తనిధి కేంద్రం నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, రక్తనిధి కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధి.. ఉపాధికి పెన్నిధి

మెదక్ జిల్లాలో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటుకు అడుగులు

న్యూస్‌టుడే, తూప్రాన్, మనోహరాబాద్, వెల్దుర్తి

పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అనువైన చోట మరిన్ని భూములు సేకరించి యువతకు ఉపాధి ఇచ్చేలా ప్రణాళిక రూపొందిస్తోంది. మెదక్ జిల్లా తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో 150కి పైగా భారీ, మధ్య చిన్నతరహా పరిశ్రమలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే కొత్తగా మనోహరాబాద్ మండలం పరికిబండ శివారులో 350 ఎకరాలకు పైగా సేకరించి అక్కడ లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే ఇక్కడి యువతకు ఉపాధి లభించే అవకాశం ఉంది.

పరికిబండ శివారులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి మండలి తాజాగా ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు రెవెన్యూ అధికారులు ఇక్కడ 72 ఎకరాల భూమిని గుర్తించారు. దీని దస్త్రాలు సిద్ధం చేసి టీఎస్ఐఐసీ అధికారులకు అప్పగించేందుకు కసరత్తు జరుగుతోంది. ఇక్కడ లాజిస్టిక్స్ పరిశ్రమ ఏర్పాటైతే 3 వేల మందికి పైగా ఉపాధి లభించే అవకాశం ఉంది.

డ్రై పోర్టు..

లాజిస్టిక్ పార్కులో డ్రై పోర్టు నిర్మించనున్నారు. ఇక్కడి నుంచి రోడ్డు, రైలు, విమాన, సముద్రమార్గాల ద్వారా వస్తువుల ఎగుమతికి వీలుగా దీన్ని ఏర్పాటుచేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించనున్నాయి. డ్రైపోర్టు నిర్మాణంతో పర్యావరణానికి ఎలాంటి ఉందు. గోదాములు నిర్మిస్తారు.

234 ఎకరాలు..

పరిశ్రమల ఏర్పాటుకు గత ప్రభుత్వం ఈ ప్రాంతంలో 234 ఎకరాలను సేకరించారు. సాగులో ఉన్న రైతులకు ఎకరాకు రూ.19 లక్షలు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న భూములకు రూ.12.5 లక్షల చొప్పున మొత్తం రూ.42 కోట్లు పరిహారం అందజేశారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం పరికిబండ శివారులోనే 611, 209 సర్వే నంబరు మధ్యలో 72 ఎకరాలలో లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటు కానుంది. సమీపంలో సేకరించనున్న 44 ఎకరాలు సేకరించనున్నారు.


పరికిబండ శివారులో టీఎస్ఐఐసీకి అప్పగించనున్న భూమి

మరికొన్ని చోట్ల

జిల్లాలోని మాసాయిపేట మండలం అచ్చంపేట, హకీంపేట, రామంతాపూర్ శివారులో 912 ఎకరాల అసైన్డ్ భూమిని, మనోహరాబాద్ మండలం పోతారం శివారులో 200కు పైగా ఎకరాలను సేకరించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. గురువారం జరిగిన సమీక్షలో సంబంధిత అధికారులు వివరాలు సేకరించారు. తూప్రాన్ మండలం ఘనపూర్‌లో ఇప్పటికే భూసేకరణ పూర్తయింది.

నిరుద్యోగులకు మేలు: శ్రీరామ్, పరికిబండ



లాజిస్టిక్ పార్కు, ఇతర పరిశ్రమలు ఏర్పాటైతే నిరుద్యోగులకు మేలు. ఉద్యోగాలకు దూరం వెళ్లే బాధ తప్పుతుంది. ఇక్కడ నిర్మించే పరిశ్రమల్లో స్థానికులకు పెద్దపీట వేయాలి. అధికారులు త్వరగా పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చర్యలు చేపట్టాలి.

భూ సేకరణ పూర్తి: జయచంద్రారెడ్డి, తూప్రాన్ ఆర్డీవో



పరికిబండ శివారులో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు నిర్మాణానికి భూ సేకరణ పూర్తి చేశాం. మెదక్ జిల్లాలో రైల్వే లైను, కొత్తగా రీజనల్ రింగు రోడ్డు రానున్న నేపథ్యంలో ఇక్కడ ఎక్కువ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది.

నేడు ప్రజావాణి

పరిగి, న్యూస్‌టుడే: కలెక్టర్ ఆదేశానుసారం సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కరీం తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

చెరువులు.. నిండు కుండలు



చెరువులు నిండు కుండల్లా మారాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బషీరాబాద్ మండలం లోని పెద్ద, చిన్న చెరువుల్లో జలకళ సంతరించుకుంది. మండలంలోని నవల్గా నల్ల చెరువు, కాశింపూర బీరప్ప చెరువు, మైల్వార్ అక్కాలమ్మ చెరువు, నవాంద్గి పెద్ద చెరువుల్లో నీరు వందశాతం చేరుకుంది. ఆయకట్టు రైతులకు ఈసారి యాసంగిలో వరి సాగుకు నీటి కష్టాలు తీరనున్నాయి. - న్యూస్‌టుడే, బషీరాబాద్

పాడిరైతుకేదీ ప్రోత్సాహం

జిల్లాలో ప్రతినెలా పాల ఉత్పత్తిదారులకు రూ.40లక్షల చెల్లింపులు జరుగుతున్నాయి. అయితే ఇవి గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆగస్టు ఒకటి, సెప్టెంబరు రెండు బిల్లులు విడుదల కావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి లీటరుకు రూ.4చొప్పున ఇవ్వాల్సిన ప్రోత్సాహక నిధులు కూడా దాదాపు మూడేళ్లకు పైబడి పెండింగ్‌లో ఉన్నాయి. సకాలంలో విడుదల చేస్తే మదర్ డెయిరీ మరింత బలోపేతం కానుందని పాలకులు అభిప్రాయపడుతున్నారు.

- న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్

పెండింగ్ బిల్లులతో అన్నదాతల పాట్లు



పల్లెల్లో పాల సేకరణ

వ్యవసాయ అనుబంధ రంగాలతో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అనేక మంది పేదలు ప్రయత్నిస్తున్నారు. ఒకటి, రెండు పశువుల పోషణతో కుటుంబాలకు ఆధారంగా మారుతున్నారు. దీంతో జిల్లాలో క్రమేపీ పాల ఉత్పత్తి పెరుగుతోంది. దీనికి తోడు నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య యూనియన్ లిమిటెడ్ (నార్ముల్) ఉత్పత్తిదారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తోంది. ఈక్రమంలోనే వివిధ రకాల రాయితీలను అందిస్తోంది. పరిగిలోని పాల శీతలీకరణ కేంద్రం పరిధిలో 15 సొసైటీలు పనిచేస్తుండగా 2,500 మంది రైతులు నుంచి దోమ, గండీడ్, మహ్మదాబాద్, రామిరెడ్డిపల్లి, దొంగెన్కెపల్లి, గోవిందాపూర్, మల్కాపూర్ సొసైటీల నుంచి ప్రస్తుతం 3,600 లీటర్ల పాలు వస్తుండగా తాండూరు కేంద్రానికి 1,600 లీటర్ల చొప్పున అందుతున్నాయి. స్థానికంగా సేకరించిన పాలను హైదరాబాద్‌లోని హయత్‌నగర్ మదర్‌డెయిరీకి పంపుతున్నారు.

రాయితీలు ఇలా

● 50కిలోల దాణా బస్తా ధర మార్కెట్లో రూ.1400 ఉండగా డెయిరీ అధికారులు రూ.900లకు అందజేస్తున్నారు.

● పశు చికిత్స మందులు 25శాతంపై సరఫరా చేస్తున్నారు.

● మిల్కోటెస్టర్లు, ఎనలైజర్లు, ఆటోమ్యాటిక్ మిల్క్ కలెక్షన్ సెంటర్లను పంపిణీ చేస్తున్నారు.

● గడ్డి విత్తనాలు రూ.10కిలోల చొప్పున అందించగా మొక్కజొన్న విత్తనాలు ఉచితంగా సరఫరా చేశారు.

● సొసైటీ సభ్యుడు ప్రమాదవశాత్తు లేదా సాధారణంగా మృతి చెందినా రూ.10వేలు ఆర్థిక సాయం నార్ముల్ అందిస్తోందని పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ బి.రాంరెడ్డి తెలిపారు.

కేంద్రం బలోపేతానికి చర్యలు

- నర్సింహారెడ్డి, డైరెక్టర్, నార్ముల్ డైరెక్టర్



పాలశీతలీకరణ కేంద్రాన్ని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తాం. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు విడుదలైతే రైతుకు ఎంతో మేలు జరుగుతుంది. దాని అనుబంధ రంగాలతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధ్యం. ఈదిశగా రైతులను ప్రోత్సహించేందుకు, బకాయిలు లేకుండా ఉండేందుకు ప్రయత్నిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74567
తాండూరు టౌన్: 80085 73260
పరిగి: 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, పరిగి: ? తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. కరెంటు పోతే చాలు నీటి కష్టాలతో అవస్థలు పడుతున్నాం. ఎర్రటి లేకుండా చర్యలు చేపట్టాలి - **వెంకటేష్, ముదుల కాలనీ, యూనుస్, ఖాన్ కాలనీ, పరిగి**

✔నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం లేక కొంత ఇబ్బంది కలుగుతోంది. కొత్త ట్యాంకుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపితే ఐటీడీఏ మంజూరయ్యాయి. త్వరలోనే టెండర్ల ప్రక్రియ కూడా పూర్తికానుంది. సమస్యకు శాశ్వతంగా తెరపడనుంది. **-వెంకటయ్య, కమిషనర్, పురపాలక సంఘం**

న్యూస్‌టుడే, కుల్కచర్ల: ? పాంబండ నుంచి బొంరెడ్డిపల్లి వెళ్లే దారిలో కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలను నిర్మించాలి. తద్వారా ప్రమాదాలు జరగవు. **-రాములు, బొంరెడ్డిపల్లి**

✔ఆ రూటులో ఇప్పటికే తారు రోడ్డు వేయించాం. కల్వర్టుల వద్ద ఎక్కువ డెక్కడ అవసరమున్నది పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. **-ఉమేష్‌కుమార్, ఈఈ, పీఆర్ విభాగం**

బషీరాబాద్: ? బషీరాబాద్ రైల్వేగేటు మలుపు వద్ద ప్రధాన దారిపై గుంత పడి ప్రయాణ ఇబ్బంది అవుతోంది. **- శంకర్, బషీరాబాద్**

✔వర్షాలకు దారి దెబ్బతిన్నది. తాత్కాలిక మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. **- జయకర్, పంచాయతీ కార్యదర్శి బషీరాబాద్**

న్యూస్‌టుడే, మోమిన్‌పేట: ? గ్రామం నుంచి ఎన్కతల వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో గుంతలను మరమ్మతులు చేసేందుకు నెలల కిందట సమస్య కంకరతో ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. **- ప్రభాకర్, ద్విచక్ర వాహన చోదకుడు, మోమిన్‌పేట.**

✔కంకర రోడ్డుపై వాహనచోదకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. **- స్వప్న, కార్యదర్శి**

న్యూస్‌టుడే, కొడంగల్: ? ససిలిటీ కాలనీలోని 'కిక' కార్యాలయానికి వెళ్లేదారిని నెలలు అవుతున్నా.. మున్సిపల్ సిబ్బంది ఊడ్చడం లేదు. రోడ్డుపై ట్రాక్టర్ ద్వారా వచ్చిన బురద మట్టి, కంకర పడి ఇబ్బందిగా ఉంది. **-యాదగిరి, ఉపాధ్యాయుడు, కొడంగల్.**

✔రెండు రోజుల్లో రోడ్డు మొత్తం శుభ్రం చేయిస్తాం. **- బలరామనాయక్, మున్సిపల్ కమిషనర్, కొడంగల్.**

పండగలతో సంస్కృతి, సంప్రదాయాల రక్షణ



బతుకమ్మ వద్ద ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు

పరిగి, న్యూస్‌టుడే: పండగల నిర్వహణతోనే భారతీయ సంస్కృతి, సంప్రదాయల పరిరక్షణ సాధ్యమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం తమ నివాసంలో జరిగిన బతుకమ్మ పండగ ఉత్సవాల్లో సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండగలను ఉత్సాహంగా జరుపుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో టీజీఆర్ సతీమణి ఉమారెడ్డి పలువురు మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు



శ్రీరామానంద ఆశ్రమంలో నిర్వహించిన యజ్ఞంలో భక్తులు

కుల్కచర్ల, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రిని కుల్కచర్ల, చౌడాపూర్ లలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కుల్కచర్ల, ఇప్పాయిపల్లి, మరికల్, చౌడాపూర్ తదితర చోట్ల మండపాలను అందంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందిస్తున్నారు. శ్రీరామానంద ఆశ్రమంలో అమ్మవారికి పూజలు, కుంకుమార్చన, హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

దోల్తాబాద్: గ్రామాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారు ఆదివారం మహేశ్వరి మాతగా దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నూతన కార్యవర్గం

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వీరశైవ లింగాయత్ లింగబలిజల తాండూరు పట్టణాధ్యక్షుడిగా గాజుల వీరప్రసాద్‌ను ఎన్నుకున్నారు. గౌతాపూర్ శివాలయంలో వేదిక మందిరంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ప్రధాన కార్యదర్శిగా పటేల్‌విజయ్ కుమార్, కోశాధికారి శేఖర్, మండలాధ్యక్షుడిగా సూర్యకాంత్, ప్రధాన కార్యదర్శిగా శాంతకుమార్‌ను ఎన్నుకున్నారు. యాలాల అధ్యక్షుడిగా ఆకుల బస్వరాజ్, ప్రధాన కార్యదర్శిగా శరణు, పెద్దేముల్‌కు సంగమేశ్వర్, రమేష్, బషీరాబాద్‌కు శ్రవణ్, ప్రభాకర్‌ను ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేయించారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు: భాజపా

పూడూరు: పార్టీకోసం కష్టపడి పనిచేసేవారికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని భాజపా మండల ఇన్‌ఛార్జి రామాయాదవ్ అన్నారు. పూడూరు మండల కేంద్రంలో ఆదివారం పార్టీ మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పరమేశ్వర్‌రెడ్డి, మల్లేశంపటేల్, వెంకటయ్య, అనిల్, రాజు ఉన్నారు.

దాడికి గురైన మహిళ.. ఆత్మహత్యాయత్నం

పూడూరు, న్యూస్‌టుడే: వివాహితపై ముగ్గురు దాడికి పాల్పడ్డారు. అవమానం భరించలేక ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన చన్గోముల్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై సత్యయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిట్టకంకల్‌కు చెందిన వివాహిత శనివారం పక్కింటికి వెళ్లగా అక్కడే ఉన్న మొల్లి రాములు, నరేశ్, మరో వ్యక్తి ఆమెతో అసభ్యంగా మాట్లాడారు.. చేయి పట్టుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంటికి వచ్చి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. ప్రస్తుతం వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కారకులైన ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అదుపు తప్పిన స్కూటీ.. ఒకరి మృతి



మృతిచెందిన రమేష్

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: స్కూటీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓవ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. ఈ సంఘటన పరిగి పట్టణంలోని కొడంగల్ చౌరస్తా పరిసరాల్లో బీజాపూర్ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నర్సియగూడకు చెందిన రమేష్(35) ప్రైవేటు డ్రైవరుగా పనిచేస్తూ పరిగి పట్టణంలోనే కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. శనివారం అర్ధ రాత్రి స్కూటీని అతివేగంగా నడుపుతూ కొడంగల్ వైపు వెళ్లే క్రమంలో మలుపు దగ్గర వాహనాన్ని మలిపే సమయంలో ఐండ్ అదుపుతప్పి పక్కనున్న డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో ఎగిరి రహదారిపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, గస్తీలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా అతను అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు. గతంలో కూడా ఇదే మార్గం రోడ్డు ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలయ్యాడని, మూడోసారి.. ప్రాణాలు కోల్పోయాడని స్థానికులు తెలిపారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే లక్ష్యం

చోరీలకు పాల్పడుతున్న దొంగలు



సీసీటీవీలో పట్టుబడిన శికారి ముఠా సభ్యులు

● జూన్ 30న పరిగి పట్టణంలోని టీచర్స్ కాలనీలో తాళం వేసి ఉన్న ఐదిళ్లలో చోరీ పాల్పడిన ముగ్గురు శికారి ముఠా సభ్యులను వికారాబాద్ జిల్లా పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించి మహారాష్ట్ర, పుణెలో అరెస్టు చేసి, చోరీ గురైన 70 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

● గత జులైలో వికారాబాద్ పట్టణంలోని మారుతీనగర్ కాలనీకి చెందిన ఇంటి యజమాని సమీప బంధువు పుట్టినరోజు విందుకు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లడంతో చోరీ జరిగింది. 2.5 లక్షల నగదు, బంగారు ఆభరణాలు అపహరణకు గురైంది. **- ఇలా తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు.**

న్యూస్‌టుడే, వికారాబాద్:

బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ఈ నెల 6 నుంచి అక్టోబరు 14 వరకు విద్యా సంస్థలకు సెలవులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని చాలా మంది పిల్లలకు సెలవులు ఉన్నందున తాము ఉంటున్న ఇళ్లకు తాళాలు వేసి సొంత ఊళ్లకు, తీర్థయాత్రలకు వెళ్లడం సాధారణమే. జిల్లాలో జరిగిన దాదాపు అన్ని దొంగతనాలు తాళాలు వేసి ఉన్న ఇళ్లలోనే జరిగాయన్నది గుర్తుంచుకోవాలి. ఇలాంటి వారు తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే చోరీలకు ఆస్కారం ఇచ్చినట్లే అవుతుంది. చోరీ జరిగిన తరువాత బాధపడేకన్నా, తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా చోరీలను నివారించవచ్చు. ఈ జాగ్రత్తలు పాటిస్తే దసరా సెలవులను హాయిగా గడపొచ్చు.

కనిపించకుండా..

● సొంత గ్రామాలకు, పర్యటనలకు వెళ్లే కుటుంబాలు ఇంటి తలుపులకు తాళాలు కనిపించేలా వేస్తే దొంగలకు విజిటింగ్ కార్డు ఇచ్చినట్లే. అలా కనిపించేలా తాళాలు వేయవద్దు. తాళం కనిపించకుండా తలుపునకు తెర వేయాలి.

● బంగారం, వెండి వంటి విలువైన వస్తువులను, నగదు ఇళ్లల్లో ఉంచకుండా చూసుకోవాలి. అలాగే పక్కింటివారికి చెప్పి వెళ్లడం, గదిలో, వరండాలో లైటు(విద్యుత్తు దీపం) వెలిగేలా ఏర్పాటు చేసుకోవాలి.

● బంధువులు, స్నేహితులు ఎవరో ఒకరు వచ్చి రోజు చూసి వెళ్లేలా, పగటిపూట లైట్లు ఆర్పి, చీకటి పడగానే మళ్లీ వేసేలా ఏర్పాటు చేసుకోవాలి.

● రోజు దినపత్రికలు వేసుకునే అలవాటు ఉన్నవారు వేసిన దినపత్రికలను అలాగే ఉంచితే ఇంట్లో ఎవరూ ఉండటం లేదన్న విషయం తెలిసిపోతుంది. అందుకే రోజూ దినపత్రికలను తీసి ఉంచమని పక్కింటివారికి చెప్పాలి.

● ఇంటికి తాళం వేసి వెళ్లేవారు తమ ఇంటి చిరునామాను పోలీస్‌స్టేషన్‌లో చెప్పి వెళ్తే పోలీసులు రాత్రి వేళ ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేస్తారు.

ఊరెళ్లేవారు సమాచారం ఇవ్వాలి..

- నారాయణరెడ్డి, జిల్లా పోలీసు అధికారి



ఇంటికి తాళం వేసి ఊరెళ్లేవారు తప్పనిసరిగా వివరాలను చేసుకొని పోలీస్‌ఠాణాలో వివరాలు చెప్పాలి. ఇంటికి తాళాలు వేసి ఊరెళ్తున్న వారి వివరాలను నమోదు చేసుకోవడానికి అన్ని పోలీస్‌ఠాణాలో ప్రత్యేకంగా ఓ రాత పుస్తకం ఉంటుంది. సమీపంలోని పోలీస్‌ఠాణాకు వచ్చి వివరాలు నమోదు చేయించే అవకాశం లేకుంటే తమ ఇంటి చిరునామాలను ఆయా ఠాణాల చరవాణి నంబర్లు సంక్షిప్త సందేశం (ఎస్ఎంఎస్), లేకుంటే ఫోన్ చేసి వివరాలు తెలపాలి. ఈ వివరాలు తెలిసిన వారి ఇళ్లపై ప్రత్యేక నిఘా వేసి రాత్రిపూట గస్తీని పెంచుతాం.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

పరిగి: దోమ మండలం రాకొండ గ్రామంలో దళితులపై దాడికి పాల్పడిన అగ్రకులం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బాధితులను పరిగిలో పరామర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. వివాదాస్పదంగా ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు సైతం సర్వే చేయడం లేదని ఆరోపించారు. గ్రామానికి చెందిన మనోజ్‌పై దాడి జరిగిందని బాధ్యులైన వారిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

భూ తగాదాలతో దాడులు.. ఇరు కుటుంబాలపై కేసు

దోమ, న్యూస్‌టుడే: భూ తగాదాలతో ఇరు కుటుంబాలు దాడి చేసుకున్న సంఘటన దోమ ఠాణా పరిధిలోని రాకొండలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాలు.. గ్రామంలో పలు సర్వే నంబర్లలో ప్రభుత్వభూమి ఉంది. మనోజ్ సోదరులకు దాని దగ్గరే 1.06 ఎకరాల పట్టా భూములు ఉన్నాయి. చాపల రాములు కుటుంబానికి ఇదే పట్టా భూమి ఉంది. ఇటీవల సరిహద్దుల విషయంలో వివాదం నడుస్తోంది. ఆదివారం నాడు రాములు, మనోజ్‌ల మధ్య మాటా మాట పెరిగి ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో మనోజ్, నర్సింలు, మనోజ్ భార్య శాంతమ్మకూ గాయాలయ్యాయి. ఈ మేరకు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నారాయణ్‌పూర్(తాండూరు గ్రామీణ): నారాయణ్‌పూర్ శివారు కాగ్నా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన వెంకట్రాంరెడ్డి ట్రాక్టర్‌లో అనుమతులు లేకుండా ఆదివారం ఇసుక తరలిస్తున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై విఠల్‌రెడ్డి వెల్లడించారు.

ఆసుపత్రి ముందు బస్సులు ఆపండి

పరిగి: సామాజిక ఆసుపత్రి వద్ద రోగుల సౌకర్యార్థం వికారాబాద్ డిపోకు చెందిన బస్సులు ఆపాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.చంద్రయ్య కోరారు. ఆసుపత్రికి ప్రత్యేకంగా గ్రామానికి చెందిన రోగులను ఆసుపత్రి వద్ద బస్సును ఆపకుండా డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయారు. దీంతో తన వాహనంలో వారిని ఎక్కించుకుని నస్కల్ వద్ద ఓవర్‌టేక్ చేసి బస్సును ఆపి ఎక్కించారు. ప్రజల ప్రాణాలతో ఆర్టీసీ అధికారులు చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నా.. డ్రైవర్లు సహకరించడం లేదన్నారు.

రంగాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



శిబిరానికి వచ్చిన రోగులు

పరిగి, న్యూస్‌టుడే: రంగాపూర్ సమీపాన ఉన్న శ్రీ సత్యసాయి సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. పరిసర గ్రామాల నుంచి హాజరైన 160 మంది రోగులను పరీక్షించిన అనంతరం నెలకు సరిపడా మందులను పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాదారం, రంగాపూర్, తాండూరు, మాదారం గ్రామాలకు చెందిన సమితి ప్రతినిధులు మహేందర్, సత్యయ్య, రవి, యాదయ్య, బాలయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

మట్టి రోడ్డు వేయండి

మర్పల్లి: కొత్లాపూర్ గ్రామంలోని పొలాలకు వెళ్లే రోడ్డు వర్షాలకారణంగా పూర్తిగా బురదమయంగా మారింది. రైతులు పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా మారిందని రైతులు వాపోతున్నారు. రెండున్నర కిలోమీటర్ల మేర ఉన్న దారి పక్కనే దాదాపు 200 ఎకరాలపైనా వ్యవసాయ భూములు ఉన్నాయి. పనుల నిమిత్తం పొలాలకు వెళ్లాలంటే కాలిబాటనే వెళుతున్నామని వాహనాలు, కాడి ఎడ్లబండి వెళ్లని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది పెసర, మినుము, సోయా పంటలను సైతం పెట్టుకొని ఇళ్లకు తీసుకోవాలని వాపోయారు.

ప్రగతి చక్రం.. పల్లెకు దూరం

● గ్రామాలకు బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు



బస్సులు రాకపోవడంతో ఆటోలో కిక్కిరిసి వెళ్తూ..

న్యూస్‌టుడే, కొడంగల్ (బొంరాస్‌పేట), దౌల్తాబాద్: పల్లెలకు చక్కటి తారు రోడ్లున్నా బస్సులు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రం నుంచి కోస్గి మండల కేంద్రానికి వెళ్లేందుకు పలు గ్రామాలకు చెందిన ప్రజలకు ఇప్పటికీ బస్సు సౌకర్యాలు లేవు. ఆటోలో ప్రయాణిస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సులు లేక కిలోమీటర్ల దూరం కాలినడకన వచ్చి వెళ్తున్నారు. ప్రజా రవాణా కష్టాలు తీర్చడానికి సంబంధిత అధికారులు బస్సులు వేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రజలు రవాణా కష్టాలు తీరలేదని పలువురు వాపోతున్నారు.

మచ్చుకు కొన్ని.. ● దౌల్తాబాద్ నుంచి కోస్గికి రెండు వరుసల రోడ్డు ఉంది. మండల కేంద్రం నుంచి నిత్యం సుమారు 110 మంది విద్యార్థులు కళాశాలలకు, 400 మందికి పైగా రైతులు పనుల నిమిత్తం కోస్గికి రాకపోకలు సాగిస్తుంటారు. కానీ వారికి కేవలం ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బస్సులు ఉంటాయి. ఇతర సమయాల్లో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

●దౌల్తాబాద్ మండల కేంద్రం నుంచి తిమ్మాయిపల్లి, గువ్వల గ్రామాల నుంచి నిత్యం 78 మంది విద్యార్థులు మండల కేంద్రంలోని పాఠశాలకు వస్తుంటారు. గ్రామస్తులు ఏ చిన్నపనికైనా నిత్యం మండల కేంద్రానికి రావాల్సిందే. కానీ వారికి బస్సులు లేక ప్రైవేట్ వాహనాల్లో రాకపోకలు నిర్వహిస్తున్నారు.

●కొడంగల్ మండలం రుద్రారం నాగారం, అన్నారం గ్రామాలకు విద్యార్థుల కోసమే ఉదయం సాయంత్రం వేళల్లో బస్సులు నడుపుతున్నారు. ప్రయాణికులు మాత్రం రాకపోకలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

● బొంరాస్‌పేట మండలం ఎన్కెపల్లి గ్రామానికి కొడంగల్ బస్టాండ్ నుంచి గతంలో బస్సు సౌకర్యం ఉండేదని ప్రస్తుతం నిలిపి వేయడంతో గ్రామస్థుల ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● బొంరాస్‌పేట మండలకేంద్రం నుంచి నియోజక వర్గ కేంద్రానికి బస్సు సౌకర్యం లేదు. ఎక్కడికెళ్లాలన్నా రెండు కిలోమీటర్లు నడిచి తుంకిమెట్లకు వెళ్లాల్సిన పరిస్థితి.

● తుంకిమెట్ల నుంచి కోస్గికి రెండు వరుసల తారు రోడ్డు ఉన్నా.. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బస్సులు ఉంటాయి.

● పోలేపల్లిలో ఈప్రాంత ప్రసిద్ధిగాంచిన రేణుక ఎల్లమ్మ దేవాలయం ఉంది. ఆ దేవాలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్నా సరిపడా బస్సులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు.

● కొడంగల్, బాపల్లితండా వల్ల మదన్‌పల్లి గ్రామాలకు పాఠశాల సమయాల్లోనే బస్సులు ఉంటాయని ఇతర సమయాల్లో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తారు.

కొత్త బస్సులు రావాల్సి ఉంది

- లావణ్య, డిపో మేనేజరు, నారాయణపేట

కోస్గి డిపోకు కొన్ని కొత్త బస్సులు రావాల్సి ఉంది. బస్సులు వచ్చిన తరువాత ప్రారంభిస్తాం. నారాయణపేట డిపోకు బీ-6 బస్సులు వచ్చాయి. ఈ బస్సులు కోస్గి డిపోలో నిర్వహణ చేసేలా లేక నారాయణపేటకు తీసుకొని వచ్చాం. వీలైనంత త్వరగా బస్సులు నడిపించేందుకు ప్రయత్నిస్తాం.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కుక్కిందలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ధారూర్, న్యూస్‌టుడే: కుక్కింద ఉన్నత పాఠశాలలో 2005-06 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. పూర్వ ఉపాధ్యాయులు యాదయ్య, నర్సింహారెడ్డి, సోమశంకర్, శ్రీనివాస్, సుదర్శన్ రెడ్డి, చంద్రశేఖర్, ఉమారాణి తదితరులు ఉన్నారు.

తాండూరు గ్రామీణ: జినుగుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల 2014-15 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. పది సంవత్సరాల తర్వాత ఒకచోట కలుసుకున్న విద్యార్థులు క్షేమ సమాచారాలను ఆరా తీశారు. ఉద్యోగం, ఉపాధి, వ్యాపార రంగాల్లో స్థిరపడటంతో సంతోషం వ్యక్తం చేశారు.

పెద్దేముల్: 26ఏళ్ల నాటి పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం అపూర్వంగా సాగింది. పెద్దేముల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం 1997- 98 నాటి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.

గ్రంథాలయ ఛైర్మన్‌కు సత్కారం



గ్రంథాలయ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న బాల్యమిత్రులు

దౌల్తాబాద్, కొడంగల్, న్యూస్‌టుడే: వికారాబాద్ జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజేశ్వర్‌రెడ్డిని బాల్య మిత్రులు సన్మానించారు. ఆదివారం కొడంగల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పదో తరగతి మిత్రులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చిన్ననాటి మిత్రులతో కలవడం ఆనందంగా ఉందన్నారు. 1989 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి మిత్రులు అందరు కలిసి కార్యక్రమం నిర్వహించారు.

PUBLIC NOTICE

The General Public are hereby informed that my client Buyani Avinash Kumar Reddy, S/o. Manohar Reddy, H.No.8-4-17/193, Sai Ram Nagar Colony, Champapet, Saroornagar Mandal, Ranga Reddy District- 500079., has lost the original Registered Sale Deed Document No. 12992 of 2023, Dt.20-09-2023, which stands in his name and Document No. 12993 of 2023, Dt. 20-09-2023, 12994 of 2023 Dt. 20-09-2023 and 12995 of 2023 Dt.20-09-2023, which stands on Sri. Buyani Shiva Kumar Reddy on 21-09-2024, while travelling in RTC bus from Hyderabad to their native place Tandur. I, request the general public whoever find the document contact and handover to me in the following address.

Sd/- J.RAJESHWAR RAO
Advocate
H.No. 16-11-1/5/11 &12 Saleemnagar Colony, New Malakpet, Hyderabad.
Mobile: 9848994225